## క్లుప్తంగా

### పంటలను కాపాడాలి

**కొణిజర్ల:** ప్రస్తుతం మొక్కజొన్న పంట కాపు దశలో ఉన్నందున ప్రభుత్వం సాగర్ జలాలు విడుదల చేసి పంటలు ఎండిపోకుండా ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు షేక్ ఖాసీం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కొణిజర్లలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వానాకాలం సరైన వర్షాలు లేక సాగర్ జలాలు రాక రైతులు సాగర్ ఆయకట్టు కింద బీడు పెట్టారన్నారు. ప్రస్తుతం రైతులు యాసంగి మొక్కజొన్న సాగు చేస్తుండగా అక్కడక్కడా పెసర, మిర్చి సాగు చేస్తున్నారన్నారు. సాగర్ నీటిని ఆరు తడులుగా వదిలి పంటలు ఎండిపోకుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్ మృతికి సంతాపం


తాళ్లూరి దుర్గమ్మ (ఫైల్)

**బోనకల్:** మండలంలోని పెద్దబీరవల్లి మాజీ సర్పంచ్ తాళ్లూరి దుర్గమ్మ(59) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. గ్రామాభివృద్ధి కోసం విశేష కృషి చేసిన ఆమె ఐద్వా ఆధ్వర్యాన జరిగిన అనేక ప్రజాపోరాటాల్లోనూ కీలక పాత్ర పోషించారు. కాగా, దుర్గమ్మ మృతదేహం వద్ద సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పొన్నం వెంకటేశ్వర్లు, చింతలచెర్వు కోటేశ్వరావు, సర్పంచ్ ఆళ్ల పున్నమ్మ, సొసైటీ అధ్యక్షుడు ఆళ్ల ప్రసాద్‌తో పాటు కర్లకుంట దేవమణి, కర్లకుంట ముత్తయ్య తదితరులు నివాళులర్పించారు.

### నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

**వైరా:** వైరాలోని కృషి విజ్ఞాన భవనంలో మంగళవారం ఉదయం 11 గంటలకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ వైరా నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### ఎమ్మెల్యేకు సన్మానం

**సత్తుపల్లిరూరల్:** తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గ తొలి మహిళా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని సోమవారం ఆమె నివాసంలో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగాని వెంకన్నగౌడ్, సంఘం సీనియర్ నాయకులు వెంకన్నగౌడ్, తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు అన్నదానం

**మధిర:** మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా సేవాసదనంలో మానసిక వికలాంగులకు సోమవారం అన్నదానం చేశారు. ముివ్వా మురళి, పద్మప్రియ దంపతుల కుమార్తె జోత్విక పుట్టినరోజు సందర్భంగా మానసిక వికలాంగులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాసదనం నిర్వాహకురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. మానసిక వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ, జాలి కలిగి ఉండాలని కోరారు. అన్నదానం చేసిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

### దుప్పట్లు పంపిణీ

**తల్లాడ:** మండలంలోని గొల్లగూడెం గ్రామంలో సోమవారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం వ్యవస్థాపకుడు పిడియల బెంజిమెన్ మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కాపా సుదాకర్, దుండేటి వీరారెడ్డి, తూము వెంకటనారాయణ, కోడూరి వీరకృష్ణ, బీరెడ్డి మల్లారెడ్డి, ఇస్నేపల్లి వీరయ్య, ఫాస్టర్లు, అంబేడ్కర్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### క్రీడా పోటీలు

**మధిర:** రిపబ్లిక్ డేని పురస్కరించుకొని న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ న్యాయవాది దేవరపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 23 నుంచి ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మధిర పాత కోర్టు ఆవరణలో సోమవారం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది క్రికెట్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డి ఉత్సాహంగా పాల్గొని న్యాయవాదులతో స్నేహపూర్వక వినోదాన్ని పంచుకున్నారు.

### కేంద్ర పథకాలపై అవగాహన

**వేంసూరు:** మండలంలోని దుద్దేపుడి గ్రామంలో జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కొక్కగడ్డ రాజ్యలక్ష్మి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మట్టా ప్రసాద్, శ్రీనివాస్, పుల్లారావు, రాంబాబు, కృష్ణ, శ్రీనివాస్, సతీష్, ఆదిశేషు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జై శ్రీరామ్..

**మార్మోగిన రామనామస్మరణ**

- కాషాయి జెండాలు, కోలాట నృత్యాలతో శోభాయాత్ర
- వాడవాడలా పూజలు.. అన్నదానాలు
- ఎల్‌ఈడీ స్క్రీన్లపై ప్రత్యక్ష వీక్షణ

శ్రీరామ జయరామ.. జయజయరామ.. నామస్మరణతో ఆలయాలు మారుమ్రోగాయి. అయోధ్యలో దివ్యబాలరాముడి ప్రతిష్ఠమహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని పలు ఆలయాల్లో రామనామ సంకీర్తనలు, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాట నృత్యాలు.. కాషాయ జెండాలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి.. అన్నదానాలు చేశారు. సీతారామలక్ష్మణ హనుమ వేషాధారనలతో రామాయణగాథను వివరించారు. పలు ఆలయాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రత్యక్ష వీక్షణం గావించారు. గృహిణులు తమ తమ ఇళ్లల్లో పూజలు జరుపుకుని, లోగిళ్లల్లో దీపాలు వెలిగించారు. గ్రామాల్లోని భక్తులు భక్తిపారవశ్యంతో మునిగిపోయారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిర: లదక బజారులో పూజలు చేస్తున్న భక్తులు


వైరారూరల్: అష్ణగుర్తిలో హోమం చేస్తున్న దృశ్యం


సత్తుపల్లిటౌన్: అయ్యగారిపేట ఆంజనేయస్వామి ఆలయంలో..


ఎర్రుపాలెం : జమలాపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కొణిజర్ల: తనికెళ్లలో అన్నదానం చేస్తున్న దృశ్యం


వైరా: కాషాయ జెండాలతో భక్తులు


కల్లూరురూరల్: రామకృష్ణాపురంలో..


కొణిజర్లలో..


బోనకల్‌లో..


సత్తుపల్లిలో కోలాటనృత్యాలతో శోభాయాత్ర


ఏన్కూరు: ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు


తల్లాడ: అన్నారుగూడెం కోదండ రామాలయంలో..


చింతకాని: కోమట్లగూడెం రామాలయంలో భజనలు చేస్తున్న మహిళలు


ఎర్రుపాలెం: అయ్యవారిగూడెంలో..


చింతకాని: నాగులవంచ గ్రామంలో..


కారేపల్లిలో..


ముదిగొండ: వెంకటాపురంలోని శ్రీకోదండరామచంద్రస్వామి ఆలయంలో..


సత్తుపల్లిరూరల్: శ్రీరామలక్ష్మణుడి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

# శివుడి విగ్రహం ఆవిష్కరణ


శివుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పక్కన నాయకులు

**వైరారూరల్:** మండలంలోని రెబ్బవరం గ్రామంలో హిందూ శ్మశాన వాటిక వద్ద ఏర్పాటు చేసిన శివుని విగ్రహం, చేతి పంపు, భూమి దాత శిలాఫలకాన్ని సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ప్రారంభించారు. శివుని విగ్రహాన్ని తాళ్లూరి శేషయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య తాళ్లూరి నాగలక్ష్మి, కుమారులు తాళ్లూరి వెంకటకృష్ణ, తాళ్లూరి మురళి బహుకరించారు. వల్లాభి సుబ్బయ్య, శాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు వల్లభి వెంకటేశ్వరరావు ఏర్పాటు చేయించారు. హిందూ శ్మశాన వాటిక నిర్మాణానికి స్థలాన్ని వితరణ చేసిన కొలిపాక రామకృష్ణ పరమానందరావును శాలువాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సాదం రామారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కిసాన్ ఖేత రాష్ట్ర ఉపాధ్యాక్షుడు దాసరి దానియేలు, నాయకులు పాదిలి హరినాథ్, తాళ్లూరి నాగేశ్వరరావు, తూము సుధాకర్, ఆకుల రమేష్, గుత్తా రామారావు, పాలేటి నర్సింహారావు, తవిడిశెట్టి శ్యాంసుందర్, సామినేని బాబు తదితరులు పాల్గొన్నారు.

**పరామర్శ..**

**కారేపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా మంగళితండా గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధరావత్ సూర్య కుటుంబాన్ని, ఉసికాయలపల్లిలో మాజీ ఉపసర్పంచ్ వెంకన్న మాతృమూర్తి మృతి చెందడంతో వారి కుటుంబాలను సందర్శించారు. పేరుపల్లిలో ఇటీవల ఘర్షణలో తీవ్రంగా గాయపడిన కేలోతు హేమ్లాను పరామర్శించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, మండల అధ్యక్షుడు చంద్రప్రకాశ్, జిల్లా నాయకుడు రామ్మూర్తి, ఎస్సీసెల్‌మండల అధ్యక్షులు మేదరి టోనీవీరప్రతాప్, భీముడు, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, షేరు తదితరులు పాల్గొన్నారు.

## గోదాం ప్రారంభం..


గోదాంను ప్రారంభిస్తున్న దృశ్యం

**వైరారూరల్:** మండలంలోని గరికపాడు సొసైటీ పరిధిలోని విప్పలమడక గ్రామంలో నాబార్డు నిధులు రూ.24 లక్షలతో నిర్మించిన సొసైటీ గోదాంను సోమవారం గరికపాడు సొసైటీ చైర్మన్ అయిలూరి కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచేందుకు గోదాంను నిర్మించినట్లు వివరించారు. కార్యక్రమంలో విప్పలమడక, గరికపాడు, దాచాపురం గ్రామాల సర్పంచులు తుమ్మల జాన్‌పాపయ్య, కోటా ఏలీషా, వేల్పుల జయరాజు, మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, తోటకూర రామారావు, సొసైటీ సీఈఓ అక్కిశెట్టి రామకృష్ణ, సంఘం వైస్ చైర్మన్ అయిలూరి కృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి


మాట్లాడుతున్న ఆర్టీఓ వెంకటపుల్లయ్య

**పెనుబల్లి:** 18 సంవత్సరాలు నిండి ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీసర్ వెంకటపుల్లయ్య సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వీయంబంజర్ జెడ్పీ విద్యార్థులకు సోమవారం ఆర్టీఓ వెంకటపుల్లయ్య రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ఉండాలని, మద్యం సేవించొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ

**కొణిజర్ల:** టీఎస్ యూటీఎఫ్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తఫజల్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జె.శంకరరావు చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్, మండల అధ్యక్షుడు షేక్ లాల్‌సయ్యద్, ప్రధాన కార్యదర్శి యం ప్రసాద్, ట్రెజరర్ ఏ నాగేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ వీరాస్వామి, సీనియర్ కార్యకర్త పి.శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభ చాటిన విద్యార్థులు


పోటీల్లో ప్రతిభ చూపిన అన్నారుగూడెం విద్యార్థులు

**తల్లాడ:** ఖమ్మంలో నిర్వహించిన ఆంగ్ల భాష పద జాలాభివృద్ధి పోటీల్లో తల్లాడ మండలంలోని అన్నారుగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా వారిని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మాదినేని నరసింహారావు, ఆంగ్ల ఉపాధ్యాయులు బి.శారదాదేవి, రత్నకుమారి, ఎంఎం.రాజకుమారి, మురళి, సుజాత, వెంకటేశ్వర్లు అభినందించారు.

### భట్టిని కలిసిన నాయకులు


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఎర్రుపాలెం:** డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను సోమవారం హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దేవరకొండ రాజీవ్‌గాంధీ, బెజ్జం శ్రీకాంత్, దేవరకొండ శ్రీనివాసరావు, గుడేటి బాబురావు, దేవరకొండ రాంబాబు, తదితరులు కలిశారు. భట్టి విక్రమార్క దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలి విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

### నరేందర్‌రెడ్డికి ముివ్వా అభినందనలు



**సత్తుపల్లి:** ప్రభుత్వ వ్యవహారాల సలహాదారుడిగా నియామకం పొందిన మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో ఖమ్మం డీసీసీబీ మాజీ చైర్మన్, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు ముివ్వా విజయబాబు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

### సోషలిజాన్ని ముందుకు తీసుకెళ్లాలి

**తల్లాడ:** సోషలిస్టు లెనిన్ వర్ధంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మాస్ లైన్ నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.లాల్‌మియా, ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాసరావు, పఠాన్ నాగుల్‌మీరా, వెంకటేశ్వర్లు, మీరా, నాగయ్య, కృష్ణ, రాము, వీరయ్య పాల్గొన్నారు.

### మైకు వితరణ

**తల్లాడ:** మండలంలోని కుర్నవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం స్వాతంత్ర్య సమర యోధుడు బోడేపూడి సూరయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు బాబు, రాజారావు రూ.25 వేలు విలువ కల్గిన మైకును వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

### దాడి ఘటనపై కేసు

**చింతకాని:** మండలంలోని జగన్నాథపురంలో జరిగిన గొడవకు సంబంధించి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన దమ్మాలపాటి శ్రీనివాసరావుతో కోలేటి రవి, మల్లయ్య, ప్రసాద్‌పై గొడవ పడి దాడి చేయగా గాయాలయ్యాయి. దీంతో శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

# తగ్గేదే లే..

- నోటీసులతో సరి..
- సెట్ బ్యాక్ పట్టింపే లేదు..
- అక్రమ నిర్మాణాలపై అధికారుల విచారణ


నోటీసుల జారీ చేసిన నిర్మాణంలో ఉన్న భవనం

**సత్తుపల్లి:** ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా పదుల సంఖ్యలో నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టినట్టు వెలుగుచూస్తుంది. 'సాక్షి'లో 'అనుమతి ఒకటి.. నిర్మించేదొకటి' సోమవారం ప్రచురితమైన కథనం చర్చానీయంశమైంది. సత్తుపల్లి పట్టణంలో అనుమతులకు మించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన నాలుగు భవంతులకు టౌన్‌ప్లానింగ్ విభాగం నోటీసులు జారీ చేసింది. అక్రమ నిర్మాణాలపై అధికారులు నోటీసులు ఇచ్చినా భవన నిర్మాణ యజమానులు భేఖాతరు చేస్తూ నిర్మాణాలు కొనసాగిస్తుండటం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు.

**ఇంటి అనుమతి ఇలా..**

ఇంటి అనుమతికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే టీపీఓ లాగిన్‌కు వెళ్తుంది. అక్కడ డాక్యుమెంట్లు పరిశీలన, రిజిస్ట్రేషన్ భూమినా, అసైన్డ్ భూమినా, లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయా..? సెట్‌బ్యాక్ ఉందా..? నిబంధనల ప్రకారం ప్లాన్ ఉందా..? ఫీజు చెల్లించారా అని క్షుణ్ణంగా పరిశీలించి టీపీఓ రివైజ్డ్ ఫీజులను ఆన్‌లైన్‌లో కట్టించుకుంటారు. దీని తర్వాత కమిషనర్ లాగిన్‌కు ఫైల్ వెళ్తుంది. అక్కడ అనుమతి లభించిన తర్వాత ఇంటికి పర్మిషన్ వస్తుంది. ఏదైనా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపై సందేహాలు తలెత్తితే స్థానిక తహసీల్దార్‌కు నివేదిస్తారు.

**నిబంధనలు పట్టించుకోవట్లే..**

భవన నిర్మాణ దరఖాస్తు సమయంలో తీసుకున్న నిబంధనలను బిల్డర్లు నిర్మించేటప్పుడు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. భవనం చుట్టూ నాలుగుమీటర్లు వదలి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా ఆదిశగా పనులు చేయటం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. సత్తుపల్లి పట్టణంలోని లలితకుమారి ఆస్పత్రిరోడ్, వేంసూరురోడ్‌ని మరో అపార్ట్‌మెంట్ అనుమతులకు మించి అదనంగా ఒక ఫ్లోర్‌ను నిర్మాణాలు, సెట్‌బ్యాక్ లేదని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిడితో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొన్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**సత్తుపల్లి ఐదు అంతస్తులకే పరిమితం..**

సత్తుపల్లి మున్సిపాలిటీలో పార్కింగ్ కాకుండా ఐదు అంతస్తులకు అనుమతి ఉంది. ఇది కూడా డీటీసీపీ వరంగల్, హైదరాబాద్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సత్తుపల్లి పట్టణంలో ఐదు అంతస్తులకు మించి పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు అక్రమంగా నిర్మించారు. ఇకపోతే ప్రతి అపార్ట్‌మెంట్‌పైన పెంట్‌హౌస్‌లు నిర్మించి క్రయవిక్రయాలు జరుపుతున్నారు.

**సెల్లార్‌లో షాపింగ్‌లు..**

పార్కింగ్ సెల్లార్లలో షాపింగ్‌లు వెలుస్తున్నాయి. అనుమతులు తీసుకునేటప్పుడు పార్కింగ్ చూపించి ఏకంగా షాపులు పెట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా షాపింగ్ కాంప్లెక్స్‌లకు విధిగా అగ్నిమాపక సూచనలతో ప్రతి అంతస్తులో ఫైర్‌పైప్‌లు పెట్టాల్సి ఉంటుంది. సత్తుపల్లి పట్టణంలో ఈ నిబంధనలు ఏమీ పట్టించుకోవటం లేదు.

**నోటీసులు ఇచ్చాం..**

సత్తుపల్లి మున్సిపాలిటీలో నిబంధనలు అతిక్రమించి నిర్మించిన నాలుగు భవన నిర్మాణాలకు నోటీసులిచ్చాం. నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశాలిచ్చాం. అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, టీపీఓ, సత్తుపల్లి మున్సిపాలిటీ

### శంకుస్థాపన

**కల్లూరు:** కల్లూరు పట్టణంలోని రామానగర్‌లో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కోసం సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్‌రావు, ఉబ్బన గోపాలస్వామి, శ్రీను, కాంతారావు, యాకూబ్ అలీ, గురవయ్య, భిక్షం, వెంకటస్వామి పాల్గొన్నారు.

### ఆలయానికి పంచలోహ విగ్రహాల వితరణ


సీతారాముల పంచలోహ విగ్రహాలను అందజేస్తున్న దాతలు

**కారేపల్లి:** మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామ పంచాయతీ నడిమూరు గ్రామంలో కొలువు తీరిన ఆంజనేయస్వామి దేవాలయానికి అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ సందర్భంగా.. అదే గ్రామానికి చెందిన తాండ్ర కార్తీక్, నవీన దంపతులు రూ.35వేలు విలువ చేసే సీతారాముల పంచలోహ విగ్రహాలను సోమవారం వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మోహన్‌రావు, కృష్ణవేణి, విశ్వనాథం, స్వరూప, కోటేష్, కవిత, శ్రీను, శృతి, నాగేశ్వరరావు, కౌలస్య, నరేష్, అజిత్, సంధ్య, అశోక్, సీతమ్మ, జమున, కమలమ్మ, సోని, భవాని, సంపత్, సాయి, విష్ణు, నవీన్, భాను, బాబు, సైధన్ తదితరులు పాల్గొన్నారు.

### శివాలయానికి చేరిన విగ్రహాలు



**సత్తుపల్లిటౌన్:** పట్టణంలోని గుడిపాడు శివాలయంలో ఫిబ్రవరి 18న ప్రతిష్ఠించనున్న దేవాతామూర్తుల విగ్రహాలు సోమవారం సత్తుపల్లికి చేరాయి. ఈ సందర్భంగా భక్తులు కోలాట నృత్యాలతో ఊరేగింపుగా విగ్రహాలను ఆలయానికి తరలించారు. కార్యక్రమంలో నర్సింహారావు, కృష్ణయ్య, మాధవరావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, బాబురావు, సూరిబాబు పాల్గొన్నారు.